క్లుప్తంగా

నేడు సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులు

చిట్యాల: నకిరేకల్ నియోజకవర్గ స్థాయి సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులను ఆదివారం చిట్యాలలోని సామ లక్ష్మీపాపిరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ శనివారం తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన పార్టీ శాఖ కార్యదర్శులు, సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు, పార్టీ ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎన్‌డీసీఎంఎస్ చైర్మన్‌కు సన్మానం


బోళ్ల వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేతేపల్లి: ఉమ్మడి జిల్లా ఎన్‌డీసీఎంఎస్ చైర్మన్‌గా ఎన్నికైన కేతేపల్లి పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకటరెడ్డిని సహకార సంఘం ఉద్యోగులు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం కేతేపల్లిలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గార్లపాటి సుధీర్‌రెడ్డి, సీఈఓ నర్సయ్య, మాజీ జెడ్పీటీసీ జటంగి లక్ష్మమ్మ వెంకటనర్సయ్యయాదవ్, నాయకులు కోట పుల్లయ్య, ప్రవీణ్‌రెడ్డి, బీరం జాన్‌రెడ్డి, నాగచారి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసే వారికి గుర్తింపు


ఉద్యోగ విరమణ పొందిన హెచ్‌ఎం పద్మావతి దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓ

కేతేపల్లి: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు గుర్తింపు తప్పక లభిస్తుందని కేతేపల్లి ఎంఈఓ నాగయ్య అన్నారు. కేతేపల్లి మండలంలోని కొత్తపేట జెడ్పీ పాఠశాలలో గెజిటెడ్ హెచ్‌ఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన పద్మావతికి శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం రాధాకృష్ణమాచార్యులు, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మధు, ఉపాధ్యాయులు నాగయ్య, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాలు అందజేత

చండూరు (గట్టుప్పల్): ఆయిల్ పామ్ సేద్యం చేసుకునే రైతులకు ఉద్యాన పట్టు పరిశ్రమ శాఖ అధికారులు శనివారం డ్రిప్ పరికరాలు అందజేశారు. ఆయిల్ పామ్ సేద్యం చేసుకునేందుకు మండల పరిధిలోని తేరేటిపల్లి, కమ్మగూడెం, గట్టుప్పల్ ప్రాంత రైతులు ఆరు నెలల క్రితం ఉద్యాన వన పట్టు పరిశ్రమ శాఖ అధికారులకు పది శాతం డీడీ రూపంలో నగదు చెల్లించారు. అయితే అధికారులు పరికరాలు మొక్కలు అందజేయడంలో నిర్లక్ష్యం వహించడంతో గురువారం 'సాక్షి దినపత్రిక'లో 'రైతులకు తప్పని ఎదురుచూపులు' శీర్షికన కథనం ప్రచురించింది. ఈమేరకు అధికారులు స్పందించి రైతులకు డ్రిప్ పరికరాలు అందించారు.

పంటలను నాశనం చేస్తున్న జింకలు


రైతులతో కలిసి మాట్లాడుతున్న ఎంపీటీసీ విష్ణు

మర్రిగూడ: రైతులు పండించిన పంటలను జింకలు నాశనం చేస్తున్నాయని, వాటి బారి నుంచి పంటలను కాపాడాలని దామెరభీమనపల్లి ఎంపీటీసీ సిలివేరు విష్ణు కోరారు. జింకల బెడద ఉన్న వ్యవసాయ భూములను శనివారం ఆయన రైతులతో కలిసి సందర్శించారు. దామెరభీమనపల్లి, కమ్మగూడ, లెంకలపల్లి, సరంపేట, రాంరెడ్డిపల్లి, తానేదారుపల్లితోపాటు పరిసర ప్రాంతాల్లో 1000- 1500 జింకల వరకు ఉన్నాయని తెలిపారు. వాటిని అటవీ ప్రాంతానికి తరలించాలన్నారు. ఆయన వెంట రైతులు వస్పరి సంజయ్, గొడ్డటి నరేష్, గొడ్డటి నరసింహ, ఎల్లపల్లి నరేష్, కర్నాటి సత్తయ్య, శివగౌడ్, మారయ్య, భిక్షం, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా సుందరయ్య



శాలిగౌరారం: శాలిగౌరారం ఎంపీడీఓ రేకల లక్ష్మయ్య శనివారం పదవీ విరమణ పొందడంతో కార్యాలయ సూపరింటెండెంట్ గాదరి సుందరయ్య ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా నియామకమయ్యారు. ఈమేరకు జిల్లా పరిషత్ ఆదేశాలు జారీ చేసింది. సోమవారం ఆయన ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాధ్యతలు స్వీకరించనున్నారు.

మురుగు కూపాలు!


శాలిగౌరారం ప్రాజెక్టు కుడికాల్వలో నిలిచి ఉన్న మురుగు నీరు

- డ్రెయినేజీ కాల్వలుగా మారిన శాలిగౌరారం ప్రాజెక్టు ప్రధాన కాల్వలు
- మురుగు నీటితో దెబ్బతింటున్న పంటలు
- దుర్వాసనతో పూడికతీత పనులు చేసేందుకు ముందుకు రాని కూలీలు


బాలిశెట్టిగూడెం వద్ద ప్రాజెక్టు కుడికాల్వలో కలుస్తున్న డ్రెయినేజీ నీరు

శాలిగౌరారం: జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు ప్రధాన కుడి, ఎడమ కాల్వలు మురుగు కూపాలుగా మారాయి. సాగు నీటికి బదులు మురుగునీటి ప్రవాహంతో పంటలు దెబ్బతింటున్నాయి. ప్రాజెక్టు ప్రధాన కుడి, ఎడమ కాల్వల్లోకి మూడు గ్రామపంచాయతీలకు చెందిన డ్రెయినేజీలను కలిపారు. అందులో కుడికాల్వలోకి తిరుమలరాయునిగూడెం గ్రామపంచాయతీ, శాలిగౌరారం గ్రామపంచాయతీల్లోని బాలిశెట్టిగూడెం, మార్కెట్‌కాలనీలకు చెందిన సైడ్ డ్రెయినేజీలను ప్రాజెక్టు కుడి కాల్వలో కలిపారు. అదేవిధంగా ఎడమ కాల్వలోకి రామగిరి గ్రామపంచాయతీకి చెందిన సైడ్ డ్రెయినేజీలను కలిపారు. దీంతో ఆయా ప్రధాన కాల్వలు సంవత్సరం పొడవునా మురుగునీటితో ప్రవహిస్తుండటం పంట కాల్వలు పూర్తిగా మురుగుగా మారాయి. అంతేకాకుండా ఆయా గ్రామాలకు సంబంధించిన వ్యర్థాలు, మృతిచెందిన మూగజీవుల కళేబరాలు ప్రధాన కాల్వల్లోనే పడేస్తున్నారు. కాల్వలు ఆయా గ్రామాల మధ్య నిర్మితమై ఉండటంతో మురుగునీరు చేరి దుర్వాసనను వెదజల్లుతున్నాయి.

దెబ్బతింటున్న పంటలు

ప్రాజెక్టులోకి మూసీ నుంచి వచ్చే కలుషిత నీటితో ఆయకట్టు రైతులు ఓ పక్క ఇబ్బందులు పడుతుంటే ఇక మూడు గ్రామపంచాయతీలకు చెందిన డ్రెయినేజీ నీరు సైతం ప్రధాన కాల్వల్లోకి వదలడంతో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇదిలా ఉండగా కాల్వల్లో ప్రవహించే మురుగునీటిని తాగడం వల్ల పశువులు, గొర్రెలు, మేకలు వ్యాధుల బారిన పడుతున్నాయి.

కాల్వల పూడికతీతకు ముందుకురాని కూలీలు

వానాకాలం, యాసంగి సీజన్‌లో ప్రాజెక్టు నుంచి నీటి విడుదలకు ముందు ప్రధాన కాల్వలను పూడిక తీసేందుకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి నిధులు మంజూరవుతాయి. అయితే ప్రధాన కాల్వల్లోకి డ్రెయినేజీలను కలపడంతో సంబంధిత కూలీలు పూడిక తీసేందుకు ముందుకు రావడంలేదు. ఈనేపథ్యంలో ప్రధాన కాల్వల్లో పూడికతీత పనులను రైతులే సొంత ఖర్చులతో జేసీబీల సాయంతో చేపడుతున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రాజెక్టు కాల్వల్లోకి డ్రెయినేజీ నీరు కలవకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

మురుగునీటితో పంటలు దెబ్బతింటున్నాయి



ప్రాజెక్టు ప్రధాన కుడి, ఎడమ కాల్వల్లోకి సమీప గ్రామాలకు చెందిన డ్రెయినేజీ మురుగునీరు కలవడంతో ప్రధాన కాల్వలు నిత్యం మురుగునీటితో ప్రవహిస్తున్నాయి. ఆ నీరు పంటపొలాల్లోకి వచ్చి చేరడంతో పంటలు దెబ్బతింటున్నాయి. ప్రధానంగా నార్లు పోసుకునే సమయంలో నార్లు పట్టకుండా దెబ్బతింటున్నాయి. తీవ్రంగా నష్టపోతున్నాం.

– చిరబోయిన పరమేష్, రైతు, రామగిరి

డ్రెయినేజీ నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలి



శాలిగౌరారం ప్రాజెక్టు పంట కాల్వల్లోకి సమీప గ్రామాలకు చెందిన డ్రెయినేజీలను కలవకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. గ్రామాలకు దూరంగా ప్రభుత్వ భూముల్లో వ్యర్థపు నీటి నిల్వ కోసం ఏర్పాట్లు చేయాలి. మురుగునీరు పంటపొలాల్లోకి చేరి దుర్వాసన వస్తుండడంతో పొలాల్లో పనులు చేసేందుకు కూలీలు కూడా రావడంలేదు.

– వేముల శివశంకర్, రైతు, శాలిగౌరారం

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

నల్లగొండ టౌన్: విద్యాహక్కు చట్టం 2009 అమలు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేకూరి గణేష్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముదికొండ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో నల్లగొండలో కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ, పేద విద్యార్థులకు 25 శాతం సీట్లను జిల్లా పరిధిలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో అమలు చేసే విధంగా వెంటనే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం జిల్లా కన్వీనర్ నారపాక అంజి, డోలుదెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మాల్గ యాదయ్య, ఎడవల్లి శ్రీనివాస్, అందుగుల ఆనంద్, నారపాక లక్ష్మణ్, బచ్చలకూరి అంజయ్య పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో సదుపాయాలు మెరుగుపరచాలి


పానగల్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఐద్వా సభ్యురాలు పద్మ

నల్లగొండ టౌన్: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ఏరియా ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, సహాయ కార్యదర్శి భూతం అరుణకుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఐద్వా ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి అక్కడ ఉన్న సమస్యలను డాక్టర్లతో పాటు రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి పీహెచ్‌సీకి ప్రతి రోజు 150 మంది వరకు రోగులు వస్తున్నారని, వారికి సరైన చికిత్స అందించేందుకు సరిపడా డాక్టర్లు లేరని ఆరోపించారు. డాక్టర్లు, నర్సులను నియమించడంతో పాటు మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, శృతి, శ్రావ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నల్లగొండ రూరల్: మండలంలోని మేళ్లదుప్పలపల్లికి చెందిన నందిపాటి అంజయ్య పూరి గుడిసె షార్ట్ సర్క్యూట్‌లో ఇటీవల దగ్ధమైంది. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకులు అంజయ్యకు శనివారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బోగరి అనిల్‌కుమార్, జెర్రిపోతుల నాగభూషణంగౌడ్, ముత్యాల శంకర్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక సేవలతోనే ప్రజల మన్ననలు సాధ్యం

- జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి


ఎంపీడీఓ లక్ష్మయ్య దంపతులను మెమొంటోతో సన్మానిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి

శాలిగౌరారం: ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో పారదర్శకంగా సేవలందించినప్పుడే ప్రజల నుంచి మన్ననలు పొందుతారని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి అన్నారు. శనివారం శాలిగౌరారం మండలంలోని భైరవునిబండ గ్రామంలో ఎంపీడీఓ రేకల లక్ష్మయ్య పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ దంపతులను పూలమాలలు, శాలువాలు, మెమొంటోతో ఘనంగా సన్మానించారు. అనంతరం జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా నీతి, నిజాయతీతో బాధ్యతాయుతంగా పనిచేసి సమాజాభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ఎర్ర రణీల, ఎంఈఓ నాగయ్య, ఆర్‌ఐ నవీన్‌కుమార్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా ఐదెకరాలకే పరిమితం చేయాలి


గొల్లగూడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న నాగరత్నం


చిట్యాలలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ సుంకరి మల్లేష్‌గౌడ్

నల్లగొండ రూరల్: ప్రభుత్వం అమలు చేయబోయే రైతు భరోసాను ఐదు ఎకరాలకే పరిమితం చేయాలని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం గొల్లగూడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నంరాజు అధ్యక్షతన ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేయబోతే రైతు భరోసా పథకంపై రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. 60 శాతం మంది రైతులు ఐదు ఎకరాలకే రైతు భరోసా అమలు చేయాలని, 30 శాతం మంది రైతులు పది ఎకరాలకు పరిమితం చేయాలని, మరో 10 శాతం మంది రైతులు ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రభుత్వ పెన్షన్ పొందేవారు, గౌరవ వేతనం పొందే రాజకీయ నాయకులకు రైతు భరోసా, రుణమాఫీ అమలు చేయొద్దని కోరారు. సమావేశంలో జిల్లా సహకార కార్యాలయ డిప్యూటీ రిజిస్ట్రార్ గోలి శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, వైస్ చైర్మన్ తవిటి కృష్ణ, డైరెక్టర్లు రుద్రాక్షి వెంకన్న, దేప వెంకట్‌రెడ్డి, హాశం, రేణుక, అంజయ్య, ఎల్లయ్య, మందడి వెంకట్‌రెడ్డి, సీఈఓ అనంతరెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు శివకుమార్, మహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా అమలుపై అభిప్రాయ సేకరణ

చిట్యాల: ప్రభుత్వ సూచన మేరకు రైతు భరోసా పథకం అమలుపై రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు డీసీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. పథకం అమలుపై శనివారం చిట్యాలలో పీఏసీఎస్ చైర్మన్ సుంకరి మల్లేష్‌గౌడ్, వెలిమినేడులో పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, గుండ్రాంపల్లిలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఆవుల నాగరాజు అధ్యక్షతన రైతుల అభిప్రాయ సేకరణ సమావేశాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఏఓ పగిడిమర్రి గిరిబాబు, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయ్‌కుమార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కృష్ణ, పీఏసీఎస్ మాజీ చైర్మన్లు నర్రా మోహన్‌రెడ్డి, పిశాటి భీష్మారెడ్డి, పీఏసీఎస్ సీఈఓలు బ్రహ్మచారి, రాజిరెడ్డి, రాజమల్లయ్య, మాజీ జెడ్పీటీసీ శేపూరి యాదయ్య, నాయకులు పోకల దేవదాసు, బొబ్బలి శివశంకర్‌రెడ్డి, వరకాంతం నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ సిబ్బంది నాగరాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర కల్పించాలి


చిట్యాలలో నిరసన తెలుపుతున్న సీపీఎం, రైతు సంఘాల నాయకులు

చిట్యాల: వ్యవసాయ భూముల్లో రైతులు పండించే అన్ని రకాల పంటలకు ప్రభుత్వాలు మద్దతు ధర అందించేలా పార్లమెంట్‌లో చట్టం చేసి అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ కోరారు. పంటలకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం చిట్యాలలో రైతు సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో నల్ల బ్యానర్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఐతరాజు నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు అర్రూరి శ్రీను, ప్రజా సంఘాల నాయకులు శీలా రాజయ్య, లడే రాములు, బొబ్బలి సుధాకర్‌రెడ్డి, గుడిసె లక్ష్మీనారాయణ, ఐతరాజు యాదయ్య, లోడే విష్ణుమూర్తి, తీగల కృష్ణయ్య, వెంకట్‌రెడ్డి, సత్తయ్య, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల కార్యవర్గం ఎన్నిక


కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల: మండలంలోని ఏపూరు, ఆరేగూడెం, గుండ్రాంపల్లి, వెంబాయి గ్రామాల్లోని పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘాల చైర్మన్, డైరెక్టర్లను శనివారం ఎన్నుకున్నారు. ఏపూరు సంఘం చైర్మన్‌గా గుమ్మి వెంగల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా భిక్షంరెడ్డితో పాటు ఎనిమిది మంది డైరెక్టర్లు ఎన్నికయ్యారు. ఆరేగూడెం పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్‌పర్సన్‌గా మురాల రాధిక, డైరెక్టర్లుగా అర్రూరీ సునంద, అర్రూరీ నాగమని, సాపిడి రమణమ్మ ఎన్నికయ్యారు. గుండ్రాంపల్లి గ్రామ పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్‌పర్సన్‌గా బత్తుల శారద, వెంబాయి పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా నక్కా శ్రీశైలం యాదవ్‌లతో పాటుగా మరికొందరు డైరెక్టర్లు ఎన్నికయ్యారు. వీరిని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందించారు. కార్యక్రమాల్లో ఏపూరు మాజీ సర్పంచ్ గడకారి సైదులు, మాజీ ఉపసర్పంచ్ సురిగి లింగస్వామి, మాజీ ఎంపీటీసీ పిశాటి మాధవరెడ్డి, ఆరేగూడెం మాజీ ఉపసర్పంచ్ రాచమల్ల జానయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు నాగంపల్లి కిషోర్‌కుమార్, బండ మహేష్, సాపిడి యాదగిరి పాల్గొన్నారు.

బస్సులు లేక విద్యార్థుల అవస్థలు

శాలిగౌరారం: మండలంలో ఆర్టీసీ అధికారులు బస్సులు నడపకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వల్లాల గ్రామంలో గల ప్రభుత్వ మోడల్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులకు ఆయా గ్రామాల విద్యార్థులు బస్సులు లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. పాఠశాలలో ప్రస్తుతం 600 మంది విద్యార్థులు ఉన్నారు. రోజూ స్కూల్ ముగిసిన అనంతరం ప్రయివేట్ వాహనాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు నడిపించాలని కోరుతున్నారు.


వల్లాల మోడల్ స్కూల్ వద్ద ఆటోల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

నేతి విద్యాసాగర్ జన్మదిన వేడుకల్లో ఎంపీ, ఎమ్మెల్యే


ఎంపీ, ఎమ్మెల్యేతో కలిసి కేక్ కట్ చేస్తున్న నేతి విద్యాసాగర్

నకిరేకల్: మాజీ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్ జన్మదిన వేడుకలు శనివారం నకిరేకల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మెయిన్ సెంటర్, ఆయన స్వగృహంలో కేక్ కట్ చేశారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం విద్యాసాగర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, మేనిఫెస్టో మెంబర్ చామల శ్రీనివాస్, బీసీ ఫైనాన్స్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య పాల్గొన్నారు.

నేడు విశ్వబ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

మిర్యాలగూడ: పట్టణంలోని జేఎస్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ కులానికి సంబంధించిన వారికి వధూవరుల పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు మిర్యాలగూడ సేవా సంస్థ కన్వీనర్ తాడోజు శ్రీనివాసచారి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి వనపర్తి డిప్యూటీ కలెక్టర్ చొల్లేటి వెంకటేశ్వర్లు హాజరవుతారని పేర్కొన్నారు. వధూవరుల పరిచయ వేదికకు విశ్వబ్రాహ్మణ పెద్దలు పాల్గొంటారని తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నకిరేకల్ : విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని నకిరేకల్ మున్సిఫ్ కోర్టు సివిల్ జడ్జి ఎస్‌కే ఆరీఫ్ అన్నారు. మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా నకిరేకల్‌లో మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు అమ్మినా, కొనుగోలు చేసినా చట్టపరమైన చర్యలు ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ పాఠశాల కరస్పాండెంట్ బీసెఫ్, న్యాయవాదులు సోమయ్య, ప్రకాష్‌రావు, పోతుల మల్లయ్య, అక్కెనపల్లి వీరస్వామి, వంగూరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

త్వరలో గురుకుల భవనాలు ప్రారంభిస్తాం

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి


వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

సంస్థాన్ నారాయణపురం : నూతనంగా నిర్మించి వదిలేసిన భవనాలను పది, పదిహేను రోజుల్లో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం సంస్థాన్‌నారాయణపురం మండలంలోని సర్వేల్ గురుకుల విద్యాలయం, జెడ్పీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వేల్ గురుకుల విద్యాలయంలో నూతనంగా నిర్మించి నిరుపయోగంగా ఉన్న భవనాలను పరిశీలించారు. పాఠశాలలో భవనాలు నిరుపయోగంగా ఉండటాన్ని నాదృష్టికి ఎందుకు తీసుకురాలేదని అధికారులు, ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నచిన్న పనులు వారంలోపు పూర్తి చేయాలన్నారు. అందుకు కావాల్సిన వసతులు కల్పిస్తామన్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా జెడ్పీ పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు.

కనీస వేతనాలు చెల్లించాలని ధర్నా

దేవరకొండ : దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం ఆ ఆస్పత్రి ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి మాట్లాడుతూ.. కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం కనీస వేతనం రూ.15,600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీఓ ప్రకారం వేతనాలు చెల్లించకుండా కార్మికులను మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. జీఓ అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేయాలని అధికారులను కోరారు. కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ జూలై 3న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జూలూరి వెంకట్రాములు, రామేశ్వరమ్మ, వనజ, రాణి, భద్రమ్మ, ప్రణయ్, తదితరులున్నారు.